ప్రజాశక్తి

శనివారం 20 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రెండో రోజు పెరిగిన నామినేషన్లు

◆ విశాఖ పార్లమెంట్‌కు 6, అసెంబ్లీ స్థానాలకు 22 ◆ అనకాపల్లి పార్లమెంట్‌కు 4, అసెంబ్లీ స్థానాలకు 6

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో రెండో రోజు నామినేషన్లు పెరిగాయి. శుక్రవారం విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి ఆరు నామినేషన్లు, ఐదు అసెంబ్లీ స్థానాలకు 22 నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, నర్సీపట్నం నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నామపత్రాలు దాఖలుచేశారు. యలమంచిలి వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు నామినేషన్ వేశారు.

వైసిపి యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న యువి.రమణమూర్తిరాజు

నేడు సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు నామినేషన్

◆ కొత్త గాజువాక జంక్షన్ నుంచి ర్యాలీ ప్రారంభం

◆ ముఖ్య అతిథులుగా వి.శ్రీనివాసరావు, పుణ్యవతి, ఇండియా వేదిక నాయకులు హాజరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు శనివారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు కొత్త గాజువాక జంక్షన్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. పాత గాజువాక జంక్షన్‌లో సభ ఉంటుంది. అనంతరం గాజువాక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను జగ్గునాయుడు సమర్పించనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, జివిఎంసిలో సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్, కాంగ్రెస్ విశాఖ జిల్లా అధ్యక్షులు గొంప గోవిందరాజు, విశాఖపట్నం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి, ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్

మరడాన జగ్గునాయుడు

శీర రమేష్ హాజరుకానున్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు ఈ నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని జగ్గునాయుడు కోరారు.

కార్మిక నాయకుడు, ప్రజా సేవకుడు జగ్గునాయుడు

సిపిఎం గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న జగ్గునాయుడు ప్రస్తుతం ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కార్మిక, మిగతా 2లో..

సిఎం రమేష్‌వి కుటిల రాజకీయాలు

◆ ఆయన్ని ప్రజలు నమ్మరు

◆ నామినేషన్ ర్యాలీలో టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు ఫైర్

ప్రజాశక్తి - మాడుగుల : బిజెపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ కుటిల రాజకీయాలకు పాల్పడి, తనకు తీవ్ర అన్యాయం చేయాలని చూస్తున్నారని టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. 'కడప రాజకీయం వేరు... ఉత్తరాంధ్ర రాజకీయం వేరు.. నిన్ను ప్రజలు నమ్మరు' అని సిఎం రమేష్‌ను ఉద్దేశించి ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అసలింతకీ ఏం జరిగిందంటే.. మాడుగల టిడిపి అభ్యర్థిగా పైలా ప్రసాదరావును చంద్రబాబు కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. ఈ మిగతా 2లో..

తూర్పులో సమస్యల తిష్ట

▶ వార్త సెంటర్ స్ప్రెడ్‌లో

విశాఖపట్నం - బెంగళూరు మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

▶ వార్త 2లో..

కొనసాగుతున్న 'గంగవరం' ఆందోళన

▶ వార్త 8లో..

నేడు నర్సింగబిల్లిలో సిద్ధం సభ

గొడిచర్ల నుంచి జగన్ బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం బస్సు యాత్ర' శనివారం జరగనుంది. పాయకరావుపేట నియోజకవర్గంలోని గొడిచర్ల నుంచి ఉదయం 9 గంటలకు ఆయన బస్సు యాత్ర ప్రారంభంకానుంది. ఉద్దండపురం, కాగిత, సీతపాలెం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి (బైపాస్) మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురం చేరుకోనుంది. ఇక్కడ మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం నాలుగు గంటల వరకు విశ్రాంతి తీసుకోనున్నారు. అక్కడ నుంచి బయలుదేరి, సాయంత్రం 4.30 గంటలకు అనకాపల్లి నియోజకవర్గంలో బహిరంగ సభ జరిగే నర్సింగబిల్లికి చేరుకుంటారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రసంగించనున్నారు. అనంతరం తాళ్ల పాలెం జంక్షన్, జమదుల పాలెం, బుచ్చెయ్య పేట, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి మీదుగా శంకరం, రేబాక, మర్రిపాలెం టోల్, దేవీపురం, గాలి భీమవరం నుంచి రాత్రి 8.30 గంటలకు బస కేంద్రమైన చిన్నయ్యపాలెంలోని టెర్రకాన్ రాయల్‌కు జగన్ చేరుకుంటారు.

ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా

రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా అధికారులను రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువులు తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు అందరిపట్లా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కషి చేయాలని సూచించారు. విశాఖపట్టణం పార్లమెంట్ వ్యయ పరిశీలకులు రంగ రాజన్, భీమిలి, తూర్పు, దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నీనా నిగం

పరిశీలకులు సౌమ్య పాండే జైన్, ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు అక్తా జైన్‌లతో కలిసి జిల్లాకు విచ్చేసిన ఆమె శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడు సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు నామినేషన్

ప్రజా సేవా కార్యక్రమాల్లో గడచిన 40 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తున్నారు. విశాఖ పారిశ్రామిక ప్రాంత వాసులకు ఆయన సుపరిచితులు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునేందుకు మూడేళ్లుగా నడుస్తున్న పోరాటానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. డిసిఐ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆయన కీలకపాత్ర పోషించారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సాధన కోసం జరిగిన ఉద్యమాల్లోనూ, వాల్తేరు రైల్వే డివిజన్ ఎత్తివేసే కేంద్ర నిర్ణయంపై సిపిఎం, సిపిఐ, వామపక్షాలు నిర్వహించిన పోరాటాల్లోనూ ఆయన పాల్గొన్నారు.

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్‌గా, సిఐటియు రాష్ట్ర నాయకునిగా పలు ఉద్యమాల్లో ఆయన తనదైన ముద్ర వేసుకున్నారు. 1985 నుంచి ప్రజా సమస్యలపై పోరాడుతూ వస్తున్నారు. ప్రభుత్వం నుంచి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. 4 దఫాలుగా 25 రోజుల పాటు జైలు జీవితం అనుభవించారు.

గాజువాక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గాజువాక : తనను గెలిపిస్తే గాజువాక ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగ్గునాయుడు తెలిపారు. గాజువాకలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం, గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్య నివారణ కోసం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాని ఆయన విజ్ఞప్తి చేశారు. గాజువాకలో 90 శాతం మంది కార్మికులు నివసిస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అటువంటి పార్టీకి రాష్ట్రంలో టిడిపి, వైసిపిలు మద్దతుగా నిలుస్తున్నాయని అన్నారు. ఆ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిఐటియు నాయకులు ఎన్.రామారావు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొన్నారు.

ఆవేశంగా ప్రసంగిస్తున్న పైలా ప్రసాదరావు

సిఎం రమేష్‌వి కుటిల రాజకీయాలు

క్రమంలో ఆయన నియోజకవర్గంలో ఇప్పటికే ప్రచారం పూర్తి చేసి శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే ఆయన్ని తప్పించి పెందుర్తి నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్‌ను చంద్రబాబు కేటాయించారు. ఈ మార్పు వెనుక సిఎం రమేష్ ఉన్నట్టు నియోజకవర్గం అంతటా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే పైలా ప్రసాదరావు పై వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం పైలా ప్రసాదరావు టిడిపి తరుపునే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట సోదరుడు పివిఎస్ఎన్.నాయుడు, పలువురు అనుచరులు ఉన్నారు. పైలా నామినేషన్ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కండువాలు ధరించినప్పటికీ జనసేన, బిజెపి కార్యకర్తలు ఎవ్వరూ కనిపించలేదు. నామినేషన్ ర్యాలీలో భాగంగా మాడుగుల బస్టాండ్‌లో నియోజకవర్గ కార్యకర్తలను ఉద్దేశించి పైలా మాట్లాడారు. సిఎం రమేష్ తప్పుడు రాజకీయాలు మానుకోవాలన్నారు. గత చీడికాడ సభలో సిఎం రమేష్ తన గురించి చెప్పిన మాటలను గుర్తుచేశారు. పైలా ప్రసాదరావును గెలిపించాలని ఆయన అప్పుడు చెప్పారన్నారు. ఇప్పుడు కుటిల రాజకీయాలకు తెరతీసి తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మబోరని తెలిపారు. పైలా వద్ద ఎన్నికలకు సరిపడా డబ్బు లేదని, అందుకే టిక్కెట్ మార్చామని ప్రచారం చేయడం తగదన్నారు. కార్యకర్తలంతా తనతోనే ఉన్నారన్నారు. తనకు అన్యాయం జరిగితే తనలోని రెండో కోణాన్ని చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఆర్థిక లావాదేవీలపై పటిష్ట నిఘా

ఎ.మల్లికార్జున, సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్, ఎంసిసి నోడల్ అధికారి, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొని ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలను తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ 11 చోట్ల చెక్ పోస్టులు పెట్టామని, విస్తృత తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వస్తు, ధన రూపేణా రూ.4.92 కోట్ల నగదును సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 110 రకాల బృందాలు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయని, నగదు తరలింపు, మద్యం రవాణాపై నిఘా ఉంచుతున్నాయని అన్నారు.

'ప్రేమా..నువ్వెక్కడ ?' చిత్రీకరణ పూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :పూర్తి సందేశాత్మకంగా రూపుదిద్దుకున్న మిని మూవీ 'ప్రేమా.. నువ్వెక్కడ?!.. షూటింగ్, పోస్టుప్రొడక్షన్ పనులను పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైందని చిత్ర దర్శకుడు బిఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భార్యభర్తలిద్దరూ వేర్వేరు వ్యాపకాల్లో బిజీగా ఉంటూ పిల్లల్ని కేర్‌టేకర్‌లకు వదిలేయడం, తమ పిల్లల జీవితాలకు మార్గదర్శకం లేకుండా పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను అనాథాశ్రమాల పాల్జేయడం వంటి సమాజంలో జరుగుతున్న నేటి సామాజిక పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకుని, పూర్తిగా విశాఖ కళాకారులతో చిత్రాన్ని నిర్మించామన్నారు. జిఎస్ఎన్ రెడ్డి సమర్పణలో డిఎన్ రాజు ప్రొడక్షన్‌లో గౌశే బాబు నిర్మాతగా వ్యవహరించారన్నారు. ఈ మూవీలో చలసాని కృష్ణ ప్రసాద్, కోరుకొండ రంగారావు, ఎం.సునీత, కె. జోషిత, మాస్టర్ విన్నకోట హర్ష, బండారు రాము, రాజీవ్ ప్రధాన పాత్రల్లో నటించారన్నారు.

ప్రేమా నువ్వెక్కడ మినీ మూవీ బృందం

30న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

గౌతు లచ్చన్న స్మారక భవనం నిర్మించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్వాతంత్రయ సమరయోధులు, సంఘ సేవకులు, సర్దార్ గౌతు లచ్చన్న స్మారక భవనం నిర్మించాలని స్థానిక నేత తోట వాసుదేవరావు ప్రభుత్వాన్ని కోరారు. గౌతు లచ్చన్న 18వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అత్తిలి శంకర్రావు, రవీశ్వరావు, తోట వాసుదేవరావు అధ్వర్యంలో గ్రీన్‌పార్క్ రోడ్డులోని సర్దార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ గౌతు లచ్చన్న సేవలను కొనియాడుతూ, ఆయన స్మారకార్థం శీలానగర్ నుంచి అనకాపల్లి రోడ్డులో ఎక్కడైనా ఐదెకరాల స్థలంలో స్మారక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బంటుపిల్లి కృష్ణ, గిరి జోగారావు, తోట హరికృష్ణ, జలుమూరి చిట్టిబాబు, మడ్డి ప్రసాద్, దొంపక భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం లక్ష్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: అభివృద్ధి, సంక్షేమం జగనన్న పాలనతోనే సాధ్యమని, వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం 93వరోజు కెఆర్ఎం.కాలనీ, చైతన్య నగర్, మద్దిలపాలెం ప్రాంతాల్లో స్థానిక వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి సత్యారెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించి, ఎన్నికల ప్రచారం చేసారు. ఈ సందర్భంగా ఎంవివి మాట్లాడుతూ కులమతాల కతీతంగా, అర్హతలే ప్రాతిపదికన సిఎం జగన్ అందరికీ పథకాలను అందించారని, అవి కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుపై తూర్పు ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మహిళలు, పార్టీ నేతలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక నేతలతో ప్రచారంలో పాల్గొన్న ఎంవివి.సత్యనారాయణ

విశాఖపట్నం, ఎస్ఎంవి బెంగళూరు మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం, ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. రైలు నెంబరు 08549 విశాఖపట్నం, ఎస్ఎంవి బెంగళూరు సమ్మర్ స్పెషల్ ట్రైన్ ఈనెల 27 నుంచి వచ్చేనెల 29 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.15 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08550 ఎస్ఎంవి బెంగుళూరు, విశాఖపట్నం సమ్మర్ స్పెషల్ రైలు ఈ నెల 28 నుండి వచ్చేనెల 30 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎంవి బెంగుళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్ళు దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయి.

జనసేన రెబల్‌గా పోటీ చేస్తా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కూటమి తరపున పోటీ చేస్తున్న యలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అవినీతిపరుడనిజనసేన నేత, మత్స్యకార సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పూడిమడకకు చెందిన ఎర్రిపల్లి కిరణ్ ఆరోపించారు. సుందరపు అవినీతి, అక్రమాలపై జనసేన అధిష్టానం స్పందించకుండా టికెట్ ఇవ్వడం అన్యాయమన్నారు. తనపై సుందరపు హత్యాయత్నం చేశాడని, అతడిని ఓడించేందుకు జనసేన రెబల్‌గా, స్వతంత్ర్య అభ్యర్థిగా తాను పోటీచేసి, విజయకుమార్‌ను ఓడిస్తానని స్పష్టం చేశారు. సుందరపు అవినీతి, హత్యాయత్నాలకు సంబంధించి ఫిర్యాదులున్నాయన్నారు కిరణ్ భార్య నూకరత్నం మాట్లాడుతూ విజయకుమార్, అతని అనుచరులు నేటికీ తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

IN THE HIGH COURT OF JUDICATURE OF ANDHRA PRADESH AT AMARAVATHI
AS No. 520 of 2023

Between:
1. Karanam Srinivasa Rao,
S/o Kondala Rao and Ors.,
.... Appellants /Plaintiffs

And:
1.M/s Gruha Jyothi Buildings & Estate Pvt., Ltd and Ors
... Respondents/Defendants

NOTICE

To

Respondent/Defendant No. (1)
M/s Gruha Jyothi Buildings & Estate Pvt., Ltd., represented by its Managing Director Sri Marampudi Srinivasa Rao, S/o Satyanarayana, Hindu, aged about 46 years, B-7, Opp. Hirawat, Leela Plaza, Dabagardens, Visakhapatnam

Respondent/Defendant No. (2)
Marampudi Srinivasa Rao, S/o Satyanarayana, Hindu, aged about 46 years, Managing Director, M/s Gruha Jyothi Buildings & amp;. Estate Pvt., Ltd., B-7, Opp. Hirawat, Leela Plaza, Dabagardens, Visakhapatnam.

Respondent/Defendant No. (3)
Marampudi Krishna Rao, S/o Srinivasa Rao, Hindu, aged about 44 years, Director, M/s Gruha Jyothi Buildings & amp;. Estate Pvt., Ltd., B-7, Opp. Hirawat, Leela Plaza, Dabagardens, Visakhapatnam.

Respondent/Defendant No. (4)
Yerneni Ramabrahmam, S/o late Harinarayana, Hindu, aged about 77 years, Director, M/s.Gruha Jyothi Buildings & amp;. Estate Pvt., Ltd., B-7, Opp. Hirawat, Leela Plaza, Dabagardens, Visakhapatnam

Respondent/Defendant No. (5)
Yerneni Hareesh, S/o Ramabrahmam, Hindu, aged about 44 years, Director, M/s. Gruha Jyothi Buildings & amp;. Estate Pvt., Ltd., B-7, Opp. Hirawat, Leela Plaza, Dabagardens, Visakhapatnam.

Respondent/Defendant No. (6)
Smt. Akarathi Satyavathi, W/o Veera Anka Ramaseshu, Hindu, aged about 48 years, residing at Qtr. No.321-C, Sector-IX, Ukkunagaram, Visakhapatnam.

Respondent/Defendant No. (8)
Smt. Kancharla Rajya Lakshmi, W/o Prabhakara Rao, Hindu, aged about 53 years, residing at MIG-II/181, Rajeev Nagar, Kurmannapalem, Gajuwaka, Visakhapatnam.

Respondent/Defendant No. (9)
Smt. Rama Lakshmi, W/o P.Raju, aged about 43 years, residing at Door No.37-6-2/1, Manchukonda Thota, Satya Nagar, Visakhapatnam.

Respondent/Defendant No. (11)
Smt. Vaja Mahalakshmi, W/o V.Ganga Raju, aged about 75 years, Hindu, residing at Duvvada village, Gajuwaka Mandal, Visakhapatnam.

Respondent/Defendant No. (12)
Mangipudi Seshamma, W/o M.Laxminarayana Pantulu, Hindu, aged about 76 years, residing at Door No.10-7-59, Ramnagar, Visakhapatnam

Whereas, the above mentioned Appellant/Plaintiffs have filed AS No. 520 of 2023 on the file of the Hon'ble High Court of Andhra Pradesh aggrieved by the Decree and Judgment dated 28.07.2023 in O.S.No. 424 of 2011 on the file of the Court of the VIII Additional District Judge, Gajuwaka and for such other reliefs as prayed therein. The Hon'ble Court vide its order in IA No.2 of 2024 dated 27.03.2024 was pleased to order publication of Notice(s) as a substitute to the service of notice on Respondents No. 1 to 6, 8,9,11 and 12 mentioned above.

Therefore, you are called upon to take Notice that the above mentioned AS No. 520 of 2023 shall be listed on 08.05.2024 at 10.30 am before the Hon'ble High Court of Andhra Pradesh and you may either appear in person or though an Advocate failing which the matter will be heard in your absence in the interests of justice.

S.V.S.S. SIVARAM
Advocate for Appellants/Plaintiffs

ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్ర వారం స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జివిఎంసి మూడో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'మా నమ్మకం నువ్వే జగన్', భీమిలి నియోజక వర్గ సమగ్రాభివృద్ధే నా ఎజెండా' పేరిట ముద్రించిన బ్రోచర్లను ఇంటింటికి వెళ్లి అందజేశారు. మే 13న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్ సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి భారతి, షణ్ముఖ రావు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మైలపల్లి లక్ష్మణరావు, ఆర్.ప్రభాకరనాయుడు, జి.మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం కూడలిలోకార్యాలయం ప్రారంభం

ఆనందపురం : ఆనందపురంలో వైసిపి కార్యాలయాన్ని ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను అనకాపల్లి వెళ్లిపోతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది గంటా అనుచరుల పని అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గంటా అతని అనుచరులు రోజూ తమ నాయకులకు ఫోన్లు చేసి వారి పార్టీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పనులు ఆపకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మే 13 తర్వాత కూడా నేను భీమిలిలోనే ఉంటానని, గంటా మాత్రం ఎక్కడ ఉంటాడో కూడా తెలియదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జడ్పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, బొట్ట రామకృష్ణ, మణిశంకర్ నాయుడు, కోన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం మండలం చందక, గొట్టిపల్లిలో విశాఖ లోక్‌సభ వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మాజీ మంత్రి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే వ్యాగన్'లో ఒప్పందం అమలు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికులతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే అమలుచేయాలని సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఇటీవల మృతిచెందిన రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ కార్మికుడు వి.వెంకటేష్ సంతాప సభను పనిప్రదేశంలో శుక్రవారం నిర్వహించారు. వెంకటేష్ చిత్రపటానికి జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కార్మికులు కె.అవుతారు, వెంకటేశ్వరాజు పాల్గొన్నారు.

ప్రదర్శనలతో విద్యార్థులు

'విశ్వోదయ'లో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -మాధవధార : మేఘాద్రిపేట అశోక పార్క్ సమీపంలో ఉన్న విశ్వోదయ సిబిఎస్‌సి స్కూల్లో శుక్రవారం ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వివిధ విభాగాల్లో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డిఫెన్స్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ నవతార్ ఎగ్జిబిషన్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు. విజ్ఞానశాస్త్రం, గణితం, పర్యావరణం ముడి సరుకుగా వినియోగించి ప్రాజెక్ట్ ఐ ఎగ్జిబిషన్‌లో డయాలసిస్, సింపుల్ సర్క్యూట్, మైక్రోస్కోప్, ఈవీఎం మిషన్, మోడల్ ఆఫ్ గ్లోబ్, చంద్రయాన్- 3, థర్మల్ పవర్ స్టేషన్, యానిమల్ సెల్, ప్లాంట్ సెల్, జి -ట్వంటీ, రామ మందిర్, యాక్సిడెంట్ ప్రివెన్షన్ సిస్టం, స్వాతంత్ర్య సమర యోధులు, తెలుగు, హిందీ భాష గొప్పతనాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ విద్యాసాగర్, ప్రిన్సిపల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

43వ వార్డులో వివి.లక్ష్మీనారాయణ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డులో ఉత్తర నియోజకవర్గ జైభారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో న్యాయాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో 'పల్లా' ప్రచారం

ప్రజాశక్తి-ఉక్కునగరం: టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఉక్కునగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విశాఖ ఎంపీగా ఎం.శ్రీభరత్‌ను, గాజువాక ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడసాల అప్పారావు, గంధం వెంకట్రావు, బిజెపి నాయకులు నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, ఉగ్రం పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఎన్నారై విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యాన ఆశ్రమ్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల వైద్య విద్యార్థుల క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు స్థానిక సంగివలస ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల డీన్ డాక్టర్ పివి.సుధాకర్ తెలిపారు. టెన్నిస్, త్రోబాల్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన వారిని శుక్ర వారం కళాశాలలో అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని బంగారు, వెండి పతకాలు సాధించాలని విద్యార్థులను కోరారు. పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందించిన వారిలో కళాశాల డీన్ డాక్టర్ సుధాకర్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ నరేష్, ఎఐ పి.శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ, సహచర విద్యార్థులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లేడీస్ సర్కిల్ ఇండియా టీం సభ్యులు సుమారు రూ. 20వేలు విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా చైర్ పర్సన్ డాక్టర్ శాంతి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే విద్యాభివృద్ధి జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా పరికరాలను ఉపయోగించుకొని శారీరకంగా, మానసికంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆర్.సన్యాసిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సహాయ సహకారాలు అందచేయటం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో స్వీటీ జోషి, నీలిమ మంచుకొండ, ఆల్కారాజ్ పుత్, అభిజ్ఞ గాంధీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

5వ వార్డులో గంటా ప్రచారం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరామ్ కాలనీ, మారికవలస, బోరవానిపాలెం, పరదేశిపాలెం, రాజీవ్ గృహకల్ప, కొమ్మాదిలో శుక్రవారం గంటా శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలుచేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు.

కాంగ్రెస్ అభ్యర్థి వర్మకు బి ఫారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇండియా వేదిక బలపర్చిన భీమిలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజు (హాసిని వర్మ) శుక్రవారం ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ద్వారా బి ఫాం అందుకున్నారు. కర్నూలు జిల్లా ఆలూరులో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆమెను కలవగా, బి ఫాం అందించినట్లు శుక్ర వారం ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 22వ తేదీన భీమిలి ఆర్‌డిఓ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - ఆరిలోవ, తగరపువలస : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనకు ఆరిలోవ అపోలో, కేర్ ఆసుపత్రుల్లో శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

తగరపువలస : అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యాన సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రి, స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన కల్పించారు.

జోరుగా నామినేషన్లు

ప్రజలకు నమస్కరిస్తూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న నాగమణి

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమిలిలో రెండు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజక వర్గంలో ఎమ్మెల్యే స్థానానికి శుక్రవారం రెండు నామినేషన్లు దాఖల య్యాయి. స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కరరెడ్డికి ఈ మేరకు నామినేషన్ పత్రాలు అందజేశారు. స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పద్మనాభం మండలం, పద్మనాభం గ్రామానికి చెందిన బుగత రాము నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఇతని అభ్యర్థిత్వాన్ని పదిమంది ప్రతిపాదించారు. స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా మధురవాడ, దుర్గానగర్‌కు చెందిన నాగోతు నాగమణి నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఈమె అభ్యర్థిత్వాన్ని పదిమంది ప్రతిపాదించారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి : నాగమణి

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నాగోతు నాగమణి తెలిపారు. నామినేషన్ పత్రం దాఖలుకు ముందు తగరపువలస నుంచి ర్యాలీగా వస్తూ మార్గమధ్యలో పాత బస్టాండ్ వద్ద స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు అనేక ప్రజా సమస్యలు తన దృష్టికి వచ్చాయని వివరించారు. త్వరలో మేనిఫెస్టోను రూపొందించి ప్రజలముందు ఉంచుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

పెందుర్తిలో 10 నామినేషన్లు

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెండో రోజు నామినేషన్ ప్రక్రియ జోరుగా సాగింది. స్వతంత్ర అభ్యర్థిగా ఆడారి నాగరాజు, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, పంచకర్ల మహాలక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి కన్నేపల్లి మాధవి కళ్యాణి శ్రీకాంత్, వైసిపి అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి ఈత రోజా, స్వతంత్ర అభ్యర్థిగా గుంటూరు సాయిప్రియ, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోలెం వెంకటమురళీమోహన్, స్వతంత్ర అభ్యర్థిగా కుందరపు సన్యాసిరావు నామినేషన్లు శు క్రవారం దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ తెలిపారు.

అదీప్‌రాజు నామినేషన్‌కు తరలివచ్చిన కార్యకర్తలు

పెందుర్తి : పెందుర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా అదీప్ రాజ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయడంతో భారీగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. రాంపురంలోని వైసిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు అభిమానుల కోలాహలంతో నిండిపోయింది. ఈ సందర్భంగా అదీప్‌రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. ముందుగా రాంపురం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుంటూరు నరసింహమూర్తి నామినేషన్

స్వతంత్ర అభ్యర్థి గుంటూరు నరసింహమూర్తి అట్టహాసంగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. సరిపల్లి గ్రామం నుంచి ర్యాలీగా పెందుర్తి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన తాను నియోజకవర్గ ప్రజలకు నిత్యమూ అందుబాటులో ఉంటానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

ప్రచారం చేస్తున్న గుంటూరు నరసింహమూర్తి తదితరులు

నోటీసు బోర్డులో స్పెషలిస్టు డాక్టర్ల వివరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం స్పెషలిస్ట్ డాక్టర్ల పేర్లు, ఎప్పుడు వస్తారనేది సమాచారం నోటీసు బోర్డులో తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టంచేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల డిఎం అండ్ హెచ్ఓ సమావేశమయ్యారు. స్పెషలిస్టు డాక్టర్ల వివరాలను ఎఎన్ఎం, ఆశ ద్వారా ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. రోగులకు మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు. పబ్లిక్ హాలిడేస్ రోజున స్టాఫ్ నర్సులు ఉండేటట్లు ప్రణాళిక వేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సమత, ఆర్‌బిఎస్‌కె డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్‌ప్రసాద్, డిఎస్ఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శనివారం
20 ఏప్రిల్ 2024

కలం మాట



ఓటరూ.. నువ్వే నీ భవిష్యత్ రైటరు!

ఓటరూ... నువ్వే నీ భవిష్యత్తు రైటరు..
నువ్వే .. నీ నుదుటి రాత ఛేంజరు..
పోలింగ్ డే అంటే ఓ హాలిడే కాదురా
నీ భవిష్యత్తు మార్చేటి జాలీడే అగును రా..
కులం.. ఓటు కాదురా
క్షణం ఆలోచించురా..
మతం.. ఓటు కాదురా
హితం ఓటు వెయ్యిరా..
హలం బలం పెంచేటి జలానికై చూడరా
ప్రభంజనం సృష్టించే జనానికై ఓటెయ్యిరా..
రాజకీయం.. కురుక్షేత్రపు
రణరంగంలాంటిది రా..
అందులో నువ్వొక జగన్నాథ
రథచక్రం లాంటోడివి రా..
అభిమన్యుని వలె దూకరా..
అర్జునుడివై తిరిగి రా..
నువ్వే ఒక డిక్టేటర్
నువ్వే ఒక నవ రూలర్
ఓటరు... నువ్వే నీ భవిష్యత్తు రైటరు
నువ్వే నీ నుదుటి రాత ఛేంజరు

– భార్గవ్ బూరుగుపల్లి



కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ఎన్నికల వ్యయ పరిశీలకులకు కమాండ్ కంట్రోల్ రూం పనితీరును వివరిస్తున్న కలెక్టర్, జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి– విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంలను ఎన్నికల వ్యయపరిశీలకుల బృందం శుక్రవారం పరిశీలించింది. రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం, విశాఖపట్టణం పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయపరిశీలకులు రంగరాజన్, భీమిలి, తూర్పు, దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సౌమ్యపాండే జైన్, ఉత్తర, పశ్చిమ, గాజువాక, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయపరిశీలకులు అక్తా జైన్ బృందం ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎంసిసి నోడల్ అధికారి సిఎం సాయికాంత్ వర్మ ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై వ్యయ పరిశీలకుల బృందానికి వివరించారు. 24×7 వెబ్ కాస్టింగ్, ఎంసిఎంసి, కంప్లైంట్ మోనటరింగ్ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల వ్యయబృందం సభ్యులు, అక్కడ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డాష్ బోర్డు, జియో ట్యాగింగ్ ద్వారా వాహన రాకపోకలు, ఇతర ప్రక్రియలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు.



అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు.
ఏపాటి వాడో చూడు...
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు..
ఇప్పటిదాకా ఏం వెలగబెట్టాడో చూడు
పెట్టుకునే టోపీ కాదు .. పెట్టిన టోపీ చూడు

– కాళోజీ నారాయణరావు

సార్వత్రిక సంగ్రామం

తూర్పులో.. సమస్యల తిష్ట..!



ప్రభుత్వాలు మారినా తూర్పులో దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయి. ఈ నియోజకవర్గంలో ప్రధానమైన సమస్య పంచగ్రామాలకు సంబంధించినది. దీనిపై ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు హామీలు గుప్పించడం.. ఆ తరువాత విస్మరించడం పరిపాటిగా మారింది.

ప్రజాశక్తి – ఆరిలోవ

- పరిష్కారానికి నోచని పంచగ్రామాల అంశం
- కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి వెతలు
- కలగానే జూనియర్ కాలేజీ ఏర్పాటు
- ప్రజలను మోసపుచ్చిన ప్రభుత్వాలు

హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకుగల కొండవాలు ప్రాంతాల్లో ఎక్కువగా పేదలు నివసిస్తున్నారు. సింహాచలం దేవస్థానం భూమి అని దేవస్థాన అధికారులు చెబుతూ వారిని ఆయాచోట్ల ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నా వారికి వాటిపై ఎటువంటి హక్కూ లేకుండా పోయింది. శిథిలమైన వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలనుకున్నా, ఇప్పటికే ఉన్న గృహాలను, స్థలాలను అవసరాల కోసం విక్రయించాలనుకున్నా కుదరడం లేదు. హక్కుల కోసం దశాబ్దాల తరబడి వారు పోరాటం సాగిస్తున్నారు. గత చంద్రబాబు, ప్రస్తుత జగన్ ప్రభుత్వాలు వారి సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చినా నెరవేరలేదు.

ఈ నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. వేసవి కాలంలో నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఇక్కడ ప్రజలకు ప్రధాన నీటి వనరు ముడసర్లోవ రిజర్వాయర్. అక్కడ నుంచి వచ్చే నీరు కలుషితంగా ఉండటంతో ప్రజలు తాగలేకపోతున్నారు. నీటిని శుద్ధి చేసే గ్యాలరీ ఎప్పటికప్పుడు పాడవడం, ఆధునిక పద్ధతితో నీటిని శుద్ధి చేయకపోవడంతో ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారు.

ఆరిలోవ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు చదువులకు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. దూర ప్రాంతాలకు చదువు కోసం వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు ఫీజుల భారం, కాలేజీ దూరం వంటి కారణాలతో బాలికలను టెన్త్ తరువాత చదువు మానిపిస్తున్నారు.

నియోజకవర్గం పరిధి

ప్రస్తుతం జివిఎంసి 9, 10, 11, 12, 13 వార్డులు, 15వ వార్డులో కొంత ప్రాంతం, 16, 17, 18, 19, 20, 21, 22, 23 వార్డులు, 28వ వార్డులో కొంత ప్రాంతం తూర్పు నియోజకవర్గంలో ఉన్నాయి. నియోజకవర్గంలో సుమారు 4.50 లక్షల మంది జనాభా ఉన్నట్టు అంచనా,. ప్రస్తుతం తూర్పులో 2.81 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. తుది లెక్కల తరువాత పెరిగే అవకాశముంది.

ఈసారి ఎవరెవరు పోటీ ?

2009లో రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొత్తగా విశాఖ తూర్పు నియోజకర్గం ఏర్పడింది. గతంలో విశాఖ – 2 నుంచి కొంత భాగం, పెందుర్తి నియోజకవర్గం నుంచి కొంత భాగం కలిసి ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. పునర్విభజన తరువాత ఇప్పుడు జరిగేది నాలుగో ఎన్నిక. గత మూడు ఎన్నికల్లోనూ టిడిపి విజయకేతనం ఎగరేసింది. ప్రస్తుతం జరగబోవు ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా ఇప్పటికే వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు టిడిపి తరుపున బరిలో ఉన్నారు. వైసిపి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంవివి.సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన విశాఖ ఎంపీగా ఉన్నారు. ఈసారి అసెంబ్లీ బరిలోకి దిగారు. ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ అభ్యర్థి జి.శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారుఆయన యూత్ కాంగ్రెస్ నేతగా పనిచేశారు..

జి.శ్రీనివాసరావు, కాంగ్రెస్

వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి

ఎంవివి.సత్యనారాయణ, వైసిపి

వలస ఓటర్లే కీలకం

తూర్పు నియోజకవర్గం ఎన్నికల్లో వలస ఓటర్లే కీలకం. విద్యా, వ్యాపార, ఉపాధి, ఉద్యోగ అవసరాల నిమిత్తం వచ్చి స్థానికంగా స్థిరపడినవారే ఎక్కువని చెప్పాలి. దీంతో గతంలో చిన్న గ్రామంగా ఉండే ఆరిలోవ ప్రాంతం ప్రస్తుతం ఒక మినీ సిటీగా అవతరించింది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల వారు ఎక్కువ మంది వారి వారి అవసరాల నిమిత్తం ఇక్కడకు వచ్చి స్థానికంగా స్థిరపడ్డారు. నియోజకవర్గానికి ఉత్తరాన భీమిలి, తూర్పున సముద్రం, దక్షిణం వైపు దక్షిణ నియోజకవర్గం, పడమర వైపు ఉత్తర నియోజకవర్గం సరిహద్దులుగా ఉన్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, విద్యాసంస్థలు కలిగిన నియోజకవర్గంగా దీన్ని చెప్పవచ్చు. విమ్స్, హెల్త్ సిటీ కూడా ఇక్కడే ఉన్నాయి. పలు మత్స్యకార గ్రామాలు, మద్దిలపాలెం, శివాజీపాలెం, ఇసుకతోట, తారామసీదు, హెచ్‌బి.కాలనీ (సింహాద్రిపురం), వెంకోజీపాలెం, పెదవాల్తేరు, చినవాల్తేరు, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ, హనుమంతువాక, ఆరిలోవ, రామకృష్ణాపురం, మువ్వలవానిపాలెం, సిబిఎం కాంపౌండ్, తోటగరువు, జోడుగుళ్లపాలెం తదితర ప్రాంతాలు నియోజకవర్గంలో ఉన్నాయి. విశాలాక్షినగర్, ఎంవిపి.కాలనీ, లాసన్స్‌బే కాలనీ, కిర్లంపూడి లేఅవుట్, భానునగర్, స్టీల్‌ప్లాంట్ కాలనీ, ఆరిలోవ కాలనీ, దయాల్‌నగర్, దీనదయాల్‌పురం, ఫ్యాకర్ లేఅవుట్, రామ్‌నగర్ ఇలా అనేక కాలనీలకు ఈ నియోజకవర్గం ఆలవాలమైంది. ఎయుతో పాటు పలు విద్యాసంస్థలు ఇక్కడే ఉన్నాయి.

మూడు పర్యాయాలు టిడిపికే పట్టం

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన తూర్పు నియోజకవర్గంలో ఇప్పుడు నాలుగో ఎన్నిక జరగబోతోంది. ఇప్పటివరకు వరుసగా మూడు పర్యాయాలు టిడిపి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబునే గెలుస్తూ వచ్చారు. నియోజకవర్గంలో తొలి రెండు సార్లు ఆయన వంశీకృష్ణ శ్రీనివాస్‌పైనే గెలిచారు. 2019 ఎన్నికల్లో అక్కరమాని విజయనిర్మలపై 26,474 ఓట్ల మెజార్టీతో వెలగపూడి విజయఢంకా మోగించి హ్యాట్రిక్‌ను అందుకున్నారు.

ఉమ్మడి విశాఖలో... కాలగర్భంలో ఏడు అసెంబ్లీ స్థానాలు

పాత జ్ఞాపకం

- కొత్తగా పలు నియోజకవర్గాలు ఆవిష్కృతం

స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భవించాక, పాలనకు దిక్సూచిగా ఉన్న భారత రాజ్యాంగం... కాలానుగుణంగా అవసరం మేరకు పలు చేర్పులు, మార్పులకు, లోపాల సవరణకు వెసులుబాటు కల్పించింది. ఇందులో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా నిర్ణీత కాలవ్యవధిలో నియోజకవర్గాల పునర్విభజన అనివార్యం కాగా, ఈ క్రమంలోనే కొన్ని నియోజకవర్గాలు చరిత్ర పుటల్లో కలిసిపోగా, మరి కొన్ని కొత్త నియోజకవర్గాలు చరిత్రలో ఆవిష్కృతమయ్యాయి.

(ప్రజాశక్తి– విశాఖ కలెక్టరేట్)

ఉమ్మడి విశాఖ జిల్లాను ఒకసారి పరిశీలిస్తే. చరిత్ర పుటల్లో కలిసిపోయిన నియోజకవర్గాలు ఏడు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం విశాఖపట్నం జిల్లాను పునర్విభజించి, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి మూడు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. మూడు జిల్లాలను కలిపి చూస్తే, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు అదృశ్యం అయ్యాయి. ఒకటి రెండు ఎన్నికల తర్వాత కొన్ని నియోజకవర్గాలు కనుమరుగు కాగా,. మరికొన్ని దశాబ్దాల పాటు కొనసాగిన తర్వాత కాలగర్భంలో కలిసిపోయాయి.

కనుమరుగైన నియోజకవర్గాల్లో గాజువాక సమీపంలోని కణితి, అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలో ఉన్న గొంప గురించి ముందుగా చెప్పుకోవాలి. కణితి కేంద్రంగా 1955లో అసెంబ్లీ నియోజవర్గం ఉండేది. ఒక్కసారి మాత్రమే ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ల తర్వాత 1962లో ఈ నియోజకవర్గంలో అదృశ్యమైంది. అలాగే, అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో గొంప అనే గ్రామం ఉంది .గొంప కేంద్రంగా 1967లో అసెంబ్లీ నియోజకవర్గ ఉండేది. ఐదేళ్ల తర్వాత 1972లో ఇది కూడా కనుమరుగై, అదే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కొండకర్ల పేరుతో 1955లో అసెంబ్లీ నియోజవర్గం ఏర్పాటైంది. 1955, 1962లలో కొండకర్ల పేరుతో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1967లో కొండకర్ల నియోజకవర్గం కూడా కనుమరుగైపోయింది.

అలాగే నర్సీపట్నం సమీపంలో గొలుగొండ కేంద్రంగాను అలాగే చింతపల్లి సమీపంలో గూడెం కొత్తవీధి కేంద్రంగా 1955లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. వీటికి 1955లో ఒక్కసారి మాత్రమే ఎన్నికలు జరగ్గా, . ఐదేళ్ల తర్వాత ఈ రెండు నియోజకవర్గాలు మాయమయ్యాయి.

అలాగే అనకాపల్లి జిల్లా పరవాడ కేంద్రంగా 1952 నుంచి అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది. 2009 వరకు ఇది కొనసాగినా, 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో పరవాడ పేరున నియోజకవర్గం లేకుండా పోయింది. 1962లో ఏర్పడ్డ చింతపల్లి అసెంబ్లీ నియోజవర్గం 2009 వరకు కొనసాగి, తర్వాత కనుమరుగైంది. 1952 నుంచి విశాఖపట్నం పేరుతో ఏర్పడిన అసెంబ్లీ నియోజకవర్గం పలు మార్పులకు గురై 1967లో విశాఖపట్నం -1, విశాఖపట్నం-2గా విభజించబడింది. 2009 వరకు కొనసాగిన ఈ రెండు నియోజకవర్గాలు, అప్పట్లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో విశాఖపట్నం తూర్పు, దక్షిణం, ఉత్తరం, పశ్చిమ నియోజవర్గాలుగా నాలుగుగా వేరుపడ్డాయి. అదే సందర్భంలో 2009లో అరకు కేంద్రంగా కొత్తగా అసెంబ్లీ నియోజకవర్గం అవతరించింది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో విశాఖపట్నం జిల్లాలో విశాఖ తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణం తో పాటు భీమిలి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, అరకు నియోజవర్గాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న విశాఖపట్నం, అనకాపల్లి లోక్‌సభ స్థానాలతోపాటు 2009లో అరకు కేంద్రంగా కొత్తగా మరొక పార్లమెంటరీ నియోజకవర్గం ఏర్పాటైంది.

నామినేషన్లు షురూ...

సందడిగా వెలగపూడి నామినేషన్ ర్యాలీ

ప్రజాశక్తి –ఎంవిపి కాలనీ : కూటమి తరపున విశాఖ తూర్పు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ముందుగా హనుమంతువాకలోని విజయదుర్గ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయం ఉషోదయ జంక్షన్, పెదవాల్తేరు కరక చెట్టు పోలమాంబ దేవాలయం మీదుగా వీఐపీ రోడ్డు అక్కడ నుండి బీచ్ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం, జగదాంబజంక్షన్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ చేరుకొని నామినేషన్ సమర్పించారు. వెలగపూడి నామినేషన్‌కు ఆరిలోవ, తోటగరువు నుంచి బాలాజీనగర్, అంబేద్కర్‌నగర్ మీదుగా చినగదిలి, పెదగదిలి హనుమంతువాక మీదుగా ఎంవిపి కాలనీ ఎమ్మెల్యే వెలగపూడి కార్యాలయం వరకు 9 నుంచి 13 వార్డుల టిడిపి శ్రేణులు తరలివెళ్లారు.

'ఉత్తరం' నుంచి కెకె.రాజు నామినేషన్

ప్రజాశక్తి–సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న కెకె.రాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.ముందుగా వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డితో కలిసి ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుండి భారీ బైక్‌ర్యాలీగా ఉత్తర వైసిపి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశానని తెలిపారు. మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ విశాఖ జిల్లా కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, ఉత్తర నియోజకవర్గం పార్టీ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, నాయకులు కటుమూరి సతీష్, సనపల చంద్ర మౌళి, బాలరాజు, బొడ్డేటి కాశీవిశ్వనాథ్, పేడాడ రమణి కుమారిపాల్గొన్నారు.

'పశ్చిమం' నుంచి ఆనందకుమార్ నామినేషన్

ప్రజాశక్తి –గోపాలపట్నం : విశాఖ పశ్చిమ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ శుక్రవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డితో కలిసి గోపాలపట్నం నూకాంబిక అమ్మవారి ఆశీస్సులు తీసుకుని గోపాలపట్నం నుంచి ఎన్ఎడి, కరాస, మర్రిపాలెం, కంచరపాలెం మీదుగా జ్ఞానాపురం జోనల్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, పశ్చిమంలో వైసిపి జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నూకాంబిక గుడికి తాళాలు

ఆడారి ఆనంద్‌కుమార్ నామినేషన్ వేసేముందు గోపాలపట్నంలోని నూకంబిక ఆశీస్సులు పొందడానికి ముహూర్తం పెట్టుకోగా, తెలుగుదేశం కూటమి నాయకులు గుడికి తాళాలు వేసి ఇబ్బంది పెట్టాలని చూశారని రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి ఆరోపించారు.

సైనిక లాంఛనాలతో వరహాలు బాబు అంత్యక్రియలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాను పడాల వరహాలుబాబు (32) అంత్యక్రియలు ఆ గ్రామంలో శుక్రవారం సైనిక లాంఛనాలు మధ్య జరిగాయి. వరహాల బాబు తన కుమారుని పుట్టి వెంట్రుకలు తీయించడానికి సెలవుపై ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. గత మంగళవారం చీడికాడ మండలం చిన్నగోగాడు సమీపంలో రోడ్డు ప్రమాదంలో వరహాలుబాబు మృతి చెందారు. బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఆర్మీ అధికారులు పి.భీమవరంలో పోలీసుల సైనిక వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం తేగాడ మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న ఉదయం 10 నుండి 12 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మార్త తిలకం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరక్ష సమయానికి ఒక గంట ముందు రావాలని సూచించారు. పరీక్ష రాసి విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో తేవాలని సూచించారు.

గురుకులం కౌన్సెలింగ్‌కు 88 మంది హాజరు

ప్రజాశక్తి- కశింకోట : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యాన నడపబడుచున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం శుక్రవారం మండలంలోని తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 88 మంది హాజయ్యారు. 183 మంది దరఖాస్తు చేయగా, 88 మంది వచ్చారు. వారికి ఉమ్మడి జిల్లాల గురుకులం సమన్వయధికారి ఎస్. రూపవతి ఆధ్వర్యాన కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ జి.గ్రేస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రి రూరల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యాన పరవాడ మండల పరిసర ప్రాంతాల్లోని 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం శుక్రవారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూరల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. దీనిని ఎన్‌టిపిసి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్టు కృషి, గౌరవం యొక్క విలువలను తెలియజేశారు. క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ తదితర క్రీడల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు సిన్హా ట్రోఫీలు, పతకాలు, ట్రాక్‌సూట్‌లను అందజేశారు, ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ డిజియమ్ శ్రీమంత మహాపాత్ర బృందం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలో నాలుగు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 8 వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఇన్చార్జ్ ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. వారిలో వి.సంతపాలెం సచివాలయ పరిధిలోని ఆనందపురం గ్రామం నుండి ముగ్గురు, చౌడువాడ సచివాలయం-1 నుంచి ఒకరు, చౌడువాడ సచివాలయం-2 నుంచి ఒకరు, సూదివలస సచివాలయ పరిధిలోని పాతవలస గ్రామం నుంచి. ముగ్గురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

గంగాధర్‌కు కాంగ్రెస్ బి.ఫారం

ప్రజాశక్తి-అనకాపల్లి

కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా శుక్రవారం బి-ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా గంగాధరకు షర్మిల శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



షర్మిల నుండి బి.ఫారం అందుకుంటున్న అనకాపల్లి అభ్యర్థి గంగాధర్

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి
- ఎన్నికల ప్రణాళికను విడుదల చేసిన సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ

ఎన్నికల ప్రణాళిక విడుదల చేస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

మతోన్మాదాన్ని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వాన్ని, దానితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన, తొత్తు పార్టీ వైసిపిని ఓడించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది. ఇండియా వేదిక ద్వారా పోటీ చేస్తున్న పార్టీలను గెలిపించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికను అనకాపల్లి పట్టణంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ దేశానికి ఎంత ప్రమాదకరమో ఇటీవల బయటపడిన ఎలక్ట్రోల్ బాండ్స్ కుంభకోణం తెలియజేస్తుందని చెప్పారు. టిటిడి నిధులను జగన్ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ముసుగు సంస్థ అయిన సమరసత సేవా ఫౌండేషన్‌కు ఇస్తూ బిజెపిని ప్రసన్నం చేసుకుంటుందని విమర్శించారు. తమ ఓట్లు, సీట్లు, మనుషులను సైతం టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి అప్పగిస్తూ తెలుగు నేలలో మత రాజకీయాలకు రంగం సిద్ధం చేస్తున్నాయని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో బాక్సైట్, విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను అదానికి ధారాదత్తం చేయడానికి బిజెపి కుట్ర చేస్తుందన్నారు. తమ పార్టీ రాష్ట్రంలోని పలాస, చోడవరం, తుని, ప్రత్తిపాడు శాసనసభ స్థానాలకు, కాకినాడ ఎంపీ స్థానానికి పోటీ చేస్తుందని చెప్పారు. అరకు ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఎం, విశాఖ పశ్చిమ నుండి పోటీ చేస్తున్న సిపిఐ, మిగిలిన చోట ఇండియా కూటమి నుండి పోటీలో వున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు తమ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మోసిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

సమీక్షా సమావేశంలో నీనా నిగమ్

మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రజాశక్తి- అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె అనకాపల్లి కలెక్టరు కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి, పోలీసు సూపరింటెండెంట్ కెవి.మురళీకృష్ణలతో కలసి వివిధ ఎన్నికల విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయంగా, ఖర్చుపరంగా పరిస్థితులు సంక్లిష్టంగా ఉండవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం భావించినట్లు చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ యంత్రాంగం సునిశిత దృష్టితో మెలుగుతూ ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో ధనం, మత్తు పదార్థాలు, ప్రలోభాలతో ఓటర్లను ఆకట్టుకునే పరిస్థితులు, చాపకింద నీరులా డబ్బు, కానుకల వెదజల్లే పరిస్థితులను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రకాలుగా పార్సిళ్ళు, నగదు రహిత లావాదేవీలు జరిపేందుకు వీలులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సారా, మత్తు పదార్థాల దొంగ రవాణాపై డేగ కన్ను వేయాలన్నారు. ముందుగా జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా స్వరూప స్వభావాలు, సరిహద్దులు, నియోజక వర్గాలు, రాజకీయ ఆర్థిక పరిస్థితులు గూర్చి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల నిర్వాహణలో పని చేస్తున్న వివిధ విభాగాల నోడల్ అధికారులు పోలీసు, ఇన్‌కమ్ టాక్స్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 12,86,241 మంది ఓటర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో ఇంతవరకు 12,86,241 మంది ఓటర్లు వున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఓటర్లలో 6,25,861 మంది పురుషులు, 6,60,352 మంది స్త్రీలు, 28 మంది థర్డ్ జండర్ ఉన్నట్లు చెప్పారు. ఇంకా 2113 క్లైమలు పెండింగ్‌లో వున్నాయన్నారు. 278 మంది ఓటర్ల నివాస మార్పు చేయవలసి వుందని చెప్పారు. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం ప్రారంభమైందని, 26వ తేదిన నామినేషన్ల పరిశీలన. 29న ఉపసంహరణలు వుంటాయని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి అదనపు రేట్ ఛార్ట్‌ను వారికి అందజేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కొల్లి రావు (ఆమ్ ఆద్మీ), పి.నాగేశ్వరరావు (బి.జె.పి), బొలిశెట్టి శ్రీనివాసరావు (తెలుగుదేశం), ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డి.టి. రవిబాబు, ఎస్.ఎ. తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఒ ఆఫీసు వద్ద మీడియాను అడ్డుకున్న పోలీసులు

బైఠాయించి నిరసన తెలిపిన జర్నలిస్టులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద శుక్రవారం మీడియా ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ నామినేషన్ దాఖలు చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఇదే సమయంలో నామినేషన్ ప్రక్రియ కవర్ చేసేందుకు చేరుకున్న మీడియాను పట్టణ సిఐ అడ్డగించారు. దీంతో 100 మీటర్ల వరకే అనుమతించాలని ఉన్నా రిటర్నింగ్ కార్యాలయం వద్దకు వేలాది మందిని ఎలా అనుమతించారని జర్నలిస్టులు ప్రశ్నించారు. దీనిపై సిఐ వివరణ ఇవ్వాలని కోరుతూ రిటర్నింగ్ కార్యాలయం ముందు బైఠాయించారు. పోలీస్ జులుం నశించాలి, పత్రికా స్వేచ్ఛను కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విలేకరులకు సర్ది చెప్పడంతో శాంతించారు.

టిడిపి అభ్యర్థి బండారు ప్రచారం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం మండలంలోని గొట్లాం, పాతవలస, మర్రివలస, శృంగవరం, సూదివలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పివిజి కుమార్ నేతృత్వంలో మాడుగుల నియోజకవర్గాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలబెడతానని చెప్పారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తన కుటుంబానికి, తప్ప నియోజకవర్గానికి చేసింది శూన్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాలలో పంచకర్ల ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం పంచాయతీల పరిధిలోని సమ్మంగిపాలెం, జాలారిపేట మత్స్యకార గ్రామాలలో శుక్రవారం పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర సమక్షంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపిటిసి సూరాడ బంగారురాజు, సూరాడ ఎర్రయ్య, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ ఎంపిటీసిలు చింతకాయల అమ్మోరు, కూండ్రపు శ్రీరామమూర్తి, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, జనసేన, టిడిపి నాయకులు బుగిడి రామ్ గోవిందరావు, వియ్యపు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లతో ప్రయోగాత్మక విజ్ఞానం

ప్రజాశక్తి- సబ్బవరం : విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రయోగాత్మక విజ్ఞానాన్ని ల్యాబ్ ద్వారా పెంపొందించుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి బిఎస్ఎన్ మూర్తి అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎటిఎల్ ఇంచార్జి టి. రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో విజ్ఞానం పెంపొందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఉపయోగపడే కొత్త ప్రయోగాలను నిర్వహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సిహెచ్‌వివి.సత్యారావు విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కెజిబివి విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, జానకిరామ్, ప్రభాకర్, తిరుపతిరావు, మోహన్ రావు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై ఆ డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగ అప్పారావు మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామంలో గురువారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డెయిరీల కంటే హెరిటేజ్ పాల సేకరణకు అధిక ధర ఇస్తుందన్నారు. పాల ఉత్పత్తిలో రైతులు చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలను ఆయన వివరించారు. సభ్యులందరికీ వ్యక్తిగత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు చేతుల మీదుగా రైతులకు మినరల్ పిక్చర్ పశుపోషణ దాణా వంటి వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము ఎం రామారావు, ఏ రమణబాబు, కే సంతోష్ కుమార్, ఎం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాదేవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ : జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ నాయకురాలు గొన్న రమాదేవి జన్మదిన వేడుకలు జివిఎంసి 85వ వార్డు గొన్నవానిపాలెంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుండి జనసేన పార్టీ నాయకులు, మహిళలు వచ్చి రమాదేవికి శుభాకాంక్షలు తెలియజేశారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమెతో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రమాదేవి ఒక మంచి స్థాయిలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన 85వ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, 79వ వార్డు అధ్యక్షుడు దుల్ల రామునాయుడు, రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ, మోటూరి సన్యాసినాయుడు, కర్రం నరసింగరావు, సుందరపు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామ శివారు గిరిజన గ్రామమైన కోదండరామపురంలో రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన మూడు సంవత్సరాల క్రితం కోటి 20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గుత్తేదారునికి బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచిపోయాయి. అసంపూర్తిగా నిలిచిన పనులతో ఈ మార్గంలో వెళ్లేందుకు గ్రామస్తులు మరింత అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా రాత్రి సమయంలో గ్రామంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మెటల్ వేసి వదిలేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చేసిన పనులకు బిల్లులు చెల్లించి, పనులు మొదలుపెట్టాలని గ్రామ సర్పంచ్ అప్పారావు కోరారు.

అస్తవ్యస్తంగా ఉన్న రహదారి

వేతన బకాయిలు చెల్లించరూ...

మధ్యాహ్న భోజన నిర్వాహకుల వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు గడిచిన 8 నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాశక్తి విలేకరి వద్ద తమ గోడును వెలదీసు కున్నారు. ప్రతి నెల రూ.3 వేలు ఇచ్చే వేతనం అందక పోవడంతో అప్పులు చేసుకోవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులకు తెలిపినా చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న నిర్వాహకులు

మాట్లాడుతున్న సంజీవ్ గాంధీ

వ్యయ పరిశీలన పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఎన్నికల వ్యయ పరిశీలన, సంబం ధిత అధికారులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్.సంజీవ్ గాంధీ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ ఎల్లప్పుడూ పర్యవేక్షించాలన్నారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక పరిశీలన బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఉపమాకలో శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక (లక్ష్మేశ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ఉదయం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమ య్యాయి. శివాలయం అర్చకులు మహేష్, వేద పండితులు భగవాన్ శర్మ, పండు శర్మ ఆధ్వర్యంలో అంకురార్పణ, హోమాలు, ధ్వజారోహణం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి నక్కపల్లిలో మైలవరపు భట్ల జోగారావు ఇంటి వద్ద నిర్వహించిన ఎదురు సన్నాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ వేదపండితులు, డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టు కున్నాయి.ముందుగా ఉపమాక శివాలయం నుండి కోలాట ప్రదర్శనతో శివపార్వత ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఎంపీవీఎస్ఎన్ మూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇటుకల పండగ సందడి

ప్రజాశక్తి-హుకుంపేట:మన్యంలో ఇటుకల పండగ సందడి మొదలైంది. ఏజెన్సీ ప్రాంతంలో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపంగా ఈ పండుగను గిరిజనులు ఆచరిస్తారు. తాత ముత్తాతల కాలం నుంచి జరుపుకుంటూ వస్తున్నారు. ఇటుకల పండగ సందర్భంగా వాహనాలను ఆపి చందాలు వసూలు చేశారు. వాహనదారులకు బొట్టుపెట్టి స్నేహపూర్వకంగా డబ్బులను అడుగుతారు. ఒకరికొకరులు నీళ్లను పోసుకుంటూ సంబ రాలు చేసుకుంటారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం మర్రివలస గ్రామానికి చెందిన పాతాళ నూకరాజు, పాతాళ వెంకటేష్, పాతాళ చిన వెంకటేష్‌తో సహా 20 మంది టిడిపి కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. వీరందరినీ సాదరంగా స్వాగతం పలికిన చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, రానున్న ఎన్నికల్లో చోడవరంలో వైసిపి విజయానికి సహకరించాలని కోరారు. మరో మారు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మర్రివలస ఎంపిటిసి సభ్యులు లోవరాజు, కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవ, స్థానిక వైసీపీ నాయకులు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నగలు అప్పగిస్తున్న సన్యాసిపాత్రుడు

ఆలయ ఆభరణాలు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి నగలను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు శుక్రవారం దేవాదాయశాఖ అధికారులకు అప్పగించారు. ఇటీవల మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, సన్యాసిపాత్రుడు మధ్య అమ్మవారి నగల విషయంలో మీడియా ముఖంగా వాగ్వివాదాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ సమక్షంలో ఈ నగలను అప్పగించారు.

కూటమి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-రోలుగుంట:అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశ్రమలు తీసుకు రావడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-రోలుగుంట:టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును మండల నాయకులు గుమ్మలూరు చంద్రమౌళి, రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ తదితరులు శుక్రవారం రోలుగుంటలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిష్టానం ఆదేశాలను అనుసరించి పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తానన్నారు. చోడవరం ఎమ్మెల్యేగా నాల్గో సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కెఎస్ఎన్ఎస్.రాజు గెలుపునకు కృషి చేస్తానన్నారు.

తాతయ్యబాబును సన్మానిస్తున్న నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో చందనాడ గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, పుణ్యమంతుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని వమ్మవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు దోసపాత్రుని హనుమంతరావు అనుచరగణంతో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వమ్మవరం గ్రామంలో కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ ఇంఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో తెదేపా కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, కొప్పిశెట్టి వెంకటేష్, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

పార్టీలో కి ఆహ్వానిస్తున్న అనిత

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్ కుమార్

ప్రజాశక్తి-గొలుగొండ:వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ కుమార్ సూచించారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటివి అధికంగా తీసు కోవాలన్నారు. లేతవర్ణం, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలన్నారు. రోజూ కనీసం 15గ్లాసుల నీళ్ల తాగాలని చెప్పారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకొని వెళ్లాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలని తెలిపారు. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేయాలని పేర్కొన్నారు. ఉప్పు కలిసిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూగోజు ద్రావణం లేదా ఓఆర్ఎస్ తాగించవచ్చునన్నారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదన్నారు. వీలైనంత త్వరగా దగ్గరలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, సరుకులు తమ ప్రాంతంలోనే ఇవ్వాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ చిన్నకోనెల, బూరిగా గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాలకు అనంతగిరి మండలం పరిధి రొంపల్లి లేదా ఎన్ ఆర్ పురం పంచాయతీ డియర్ డిపో నుండి ఆయా గ్రామాలకు రేషన్ బియ్యం, సరుకులు పంపిణీ చేయవలసి ఉంది. కానీ, విజయనగరం జిల్లా లోతుగడ్డ పంచాయతీ సారడవలస డిపోలో సరుకులు విడిపించు కోవాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రాను పోను 16 కిలోమీటర్లు కొండ కొండల నడుమ నుండి భుజంపై మోసి గ్రామాలకు చేరవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామాలకు రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనంలో సరఫరా చేయాలని వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు, గ్రామస్తులు సింహాచలం, బి సన్యాసి రావు డిమాండ్ చేశారు. లేని పక్షాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఉత్సాహంగా సిపిఎం ప్రచారం

ఆందోళన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

కొనసాగుతున్న 'గంగవరం' ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ప్రధాన గేటు వద్ద కార్మికులు కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. అదాని యాజమాన్యం తప్పుడు విధానాల వల్ల పోర్టు లోపల స్టీల్ ప్లాంట్ సంబంధించిన ఐరన్ ఓర్, బొగ్గు నిల్వలు ఉండిపోయానని తెలిపారు. చర్చల పేరుతో కార్మికుల మధ్య ఐక్యమత్యం చెడగొట్టడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. యాజమాన్యం స్పందించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

58వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి కారాడవీధి, శ్రీహరిపురం పాత రామాలయం ప్రాంతాల్లో పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రచారం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డు వైసిపి అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, కార్పొరేటర్ గులిగిందల లావణ్య, నాయకులు అంగ రాంప్రసాద్, పిల్లా కన్నబాబు, బర్రి సంతోష్, గొందేసి పెద్ద సత్యనారాయణరెడ్డి, ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫకీర్ తకియాలో ప్రచారం చేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-గాజువాక : ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు గెలుపు కోరుతూ శుక్రవారం వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పకీర్‌తకియ గ్రామంలో అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, యు.రామస్వామి, కార్పొరేటర్ గంగారావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, అప్పలరాజు, ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేస్తూ ప్రచారం నిర్వహించారు.

65వ వార్డులో ఆర్.నాగేశ్వర్ ఆధ్వర్యాన బానోజీతోటలో, 66వ వార్డు పరిధి అజీమా బాద్‌లో బంగారునాయుడు, లక్ష్మి, మూర్తి ఆధ్వర్యాన, 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో కిరీటం, సంతోషం ఆధ్వర్యాన, 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో లోకేష్, జి.శ్రీను ఆధ్వర్యాన, 70వ వార్డు పరిధి దశమకొండలో డి.నరసింగరావు, ఎం.సుబ్బారావు ఆధ్వర్యాన, 71వ వార్డు పరిధి సుందరయ్యకాలనీలో కృష్ణ, శ్రీనివాస్ ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, సిపిఎం అభ్యర్థికి ఓటు వేయాలని

జగ్గునాయుడును గెలిపించుకుందాం : ఐద్వా

మహిళల సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి - ఉక్కునగరం : గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించుకోవడం తప్పనిసరి అని ఐద్వా జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి అన్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జగ్గునాయుడు నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మూడు సంవత్సరాలుగా రిలే నిరాహార దీక్ష శిబిరం కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, జనాన్ని ఇబ్బందులపాలుజేస్తున్న బిజెపికి, దానికి మద్దతునిస్తున్న పార్టీలకు ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం, జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. పద్మ, వై.సత్యవతి, సిపిఎం మాజీ కార్పొరేటర్ విమల, డి.వాణి, ప్రభ, శేషు, జనార్దనమ్మ, వాణిప్రసాద్, వి.దేవి పాల్గొన్నారు.

ఆరిలోవలో కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : కమ్యూనిస్టు నాయకుడు వి.కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి సభను ఆరిలోవ సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎ.అజశర్మ మాట్లాడుతూ, ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు వి.కృష్ణమూర్తి అని కొనియాడారు. ఆరిలోవ ప్రాంతం ఏర్పాటులో, కాలనీల్లో మౌలికవసతులు కల్పించడంలోనూ కృష్ణమూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. చివరి వరకు నమ్మిన ఎర్రజెండా సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేశారని తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో రాజకీయాలకతీతంగా అభిమానించే వ్యక్తి కృష్ణమూర్తి అన్నారు. నేడు బిజెపి అనుసరిస్తున్న మతతత్వ, ఆర్థిక విధానాల వల్ల ప్రజానీకం పెద్ద ఎత్తున నష్టపోతున్నారని, ఈ తరుణంలో బిజెపిని, దానితో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం, జనసేనను, వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఆరిలోవలో పేదలకు ఇళ్ల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఆ సందర్భంలో ఆయన అరెస్టు అయి జైలు జీవితం గడిపారన్నారు. ఆరిలోవలో జూనియర్ కాలేజీ, క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, రైతు బజార్ ఏర్పాటుచేయాలని, విమ్స్ ఆసుపత్రిని ప్రైవేటీకరణ ఆపాలని పెద్దఎత్తున పోరాడరని గుర్తుచేశారు. పిల్లలకు కులాంతర, ఆదర్శ వివాహాలు జరిపారని తెలిపారు. ఈ సభలో సిపిఎం జోన్ నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఎస్.రంగమ్మ, సూర్యమణి, ఐసి.నాయుడు, సత్యనారాయణ, కాంతం, శాంతి రమణమ్మ, కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు మోహన్, లావణ్య, శార్వాణి, పార్టీ సభ్యులు రత్నం, గురుమూర్తి, భాస్కర్, రవణమ్మ, అప్పలనాయుడు, భూలోకరావు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న నామినేషన్లు

ప్రజాశక్తి - యలమంచిలి

రెండో రోజు నామినేషన్ల దాఖలు ఊపందుకున్నాయి. యలమంచిలి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన వెంట అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ప్రస్తుత ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సుకుమార్‌వర్మ తదితరులు ఉన్నారు. ముందుగా నియోజకవర్గం నలుమూలల నుండి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీ నిర్వహించారు. డిఎస్‌పి సత్యనారాయణ, సి.ఐ.గఫూర్, ఎస్.ఐ. పాపినాయుడుల పర్యవేక్షణలో నాలుగు మండలాలకు చెందిన పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా పార్టీ పరిశీలకుడు జగన్నాథం, స్థానిక ఎంపిపి బోదెపు గోవింద్, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, రంగా సాయి, రాజాన మహలక్ష్మి, శ్రీనురాజు, సంధ్యారాణి, ధూళి నాగరాజు, బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, నాలుగు మండలాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

భారీగా తరలిన వైసిపి శ్రేణులు

అచ్యుతాపురం : ఎలమంచిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబురాజు నామినేషన్ సందర్భంగా అచ్యుతాపురం మండలం నుంచి శుక్రవారం ఉదయం అత్యధిక సంఖ్యలో సర్పంచులు ఎంపిటీసీ సభ్యులు కార్యకర్తలు, అభిమానులు బంధువులు తరలి వెళ్లారు. మునగపాక, అచ్యుతాపురం మండలాలకు చెందిన కార్యకర్తలు ద్విచక్ర వాహనాలు ఆటోలు, కార్లపై అచ్యుతాపురం మీదుగా వెళ్లడంతో ఈ మార్గం రాజకీయరంగు జండాలతో నిండిపోయింది.

అనకాపల్లిలో కొణతాల రామకృష్ణ

అనకాపల్లి : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం వేలాదిమంది నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి గుండాలు జంక్షన్లో ఉన్న ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో తన నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా రింగ్ రోడ్‌లోని జనసేన కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించి, మెయిన్ రోడ్డు, మున్సిపల్ స్టేడియం, నెహ్రూ చౌక్ జంక్షన్, రామచంద్ర థియేటర్ జంక్షన్ మీదుగా గుండాలు జంక్షన్ చేరుకున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ స్టేడియం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవికి నామినేషన్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, కొణతాల బాలసుబ్రమణ్యం, జోగినాయుడు, డి పరమేశ్వర రావు, సిఎం రిత్విక్, దాడి జైవీర్, కాంద్రేగుల శ్రీరామ్, బొద్దపు ప్రసాద్, తాడి రామకష్ణ, శ్రీరామదాసు గోవింద పాల్గొన్నారు. జబర్దస్త్ ఆర్టిసులు ఆది, రాపేటి అప్పారావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

తరలివెళ్లిన కార్యకర్తలు

కశింకోట : అనకాపల్లిలో జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ నామినేషన్ కార్యక్రమానికి కసింకోట మండలం నుండి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. తీడ గ్రామం నుండి ఓ అభిమానిపార్టీ గుర్తు గాజుగ్లాస్‌ను ప్రత్యేకంగా తయారు చేసి తన ద్విచక్రవాహంపై కట్టుకొని వెళ్ళారు. ఆయన వాహనం పలువురిని ఆకట్టుకుంది.

నామినేషన్ సమర్పిస్తున్న జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

నామినేషన్ అందజేస్తున్న టిడిపి అభ్యర్థి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నంలో అయ్యన్న

అనకాపల్లిడెస్క్ : నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నర్సీపట్నం నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి భారీ ఎత్తున మూడు పార్టీల శ్రేణులు తరలి వచ్చారు. ఉదయం 9 గంటలకు అయ్యన్నపాత్రుడు తన ఇంటి వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఐదు రోడ్ల జంక్షన్, కృష్ణాబజారు, అబీద్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అనకాపల్లి ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, మాజీ ఎమ్మెల్సీ వప్పల చలపతిరావులతో కలిసి నర్సీపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్‌వి.జయరాంకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తన నామినేషన్ కార్యక్రమానికి ఇంత భారీగా తరలివచ్చిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రెండో రోజు నామినేషన్ నిల్

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించి అభ్యర్థుల నుండి శుక్రవారం రెండవ రోజు కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి తెలిపారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 25 వ తేదీ వరకు పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు సేకరిస్తామన్నారు.

ఓటర్లను అభ్యర్థిస్తున్న వైసిపి అభ్యర్థి ధర్మశ్రీ

వైసిపి అభ్యర్థి ధర్మశ్రీ ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ శుక్రవారం చోడవరంలో ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం సాగించారు.

24న నామినేషన్

ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. నామినేషన్‌కు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడొద్దు

ప్రజాశక్తి- అచ్యుతాపురం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎవరూ ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదని అచ్యుతాపురం సిఐ ఎం.బుచ్చిరాజు అన్నారు. మండలంలోని నడింపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఎన్నికలు ముందు జాగ్రత్తలు, ఓటర్ల బాధ్యతలు తదితర వాటిపై ఆయన వివరించారు. గ్రామస్తులు ఎన్నికల్లో తీసుకోవలసిన, అనుసరించాల్సిన పద్ధతులను తెలిపారు. అసాంఘిక చర్యలకు పాల్పడినా, ఎటువంటి వివాదాల్లో తలదూర్చిన వారిపై తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.